క్లుప్తంగా

30న దేవాలయ షాపులకు వేలం

మద్దిపాడు: మండలంలోని మల్లవరం వెంకటేశ్వరస్వామి దేవాలయం వద్ద షాపులకు ఈ నెల 30వ తేదీ ఉదయం 10 గంటలకు దేవాలయ ఆవరణలో దేవదాయ శాఖ అధికారుల సమక్షంలో బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి దామా నాగేశ్వరరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పెండ్లిమండపం ఏర్పాటు, జనరేటర్‌పై లైటింగ్ వేసుకునే హక్కుకు 25 వేల రూపాయల ధరావత్తు చెల్లించి వేలంలో పాల్గొనాలని చెప్పారు. ఈ ఏడాది ఏప్రిల్ 1 నుంచి 2025 మార్చి 31వ తేదీ వరకూ సంవత్సర కాలం లీజు హక్కు ఉంటుందన్నారు. హెచ్చు పాటదారుడు పాడుకున్న మొత్తాన్ని వెంటనే చెల్లించాలని స్పష్టం చేశారు. వేలంలో పాల్గొనే వారు దేవాలయానికి ఎటువంటి బకాయిలు, లావాదేవీలు కలిగి ఉండరాదని తెలిపారు. ప్రతి పాటదారుడు తనకున్న ఆస్తి స్థితిగతులను తెలిపే ధ్రువీకరణ పత్రాన్ని సంబంధిత మండల రెవెన్యూ అధికారి వద్ద పొంది పాట సమయంలో ఆలయ కార్యనిర్వహణాధికారికి అందించాలని తెలిపారు. పాటదారుడు సబ్‌లీజులు ఇవ్వడానికి వీలులేదని స్పష్టం చేశారు.

సువిధ పోర్టల్‌లో నమోదు చేసుకోవాలి

నాగులుప్పలపాడు: సాధారణ ఎన్నికల నియమావళి అమలులో ఉన్నందున ఏ రాజకీయ పార్టీ అయినా తమ ప్రచారాలకు, సభలకు, మైకులు ఏర్పాటు చేసుకునేందుకు ఎన్నికల కమిషన్ నిర్వహిస్తున్న సువిధ ఆన్‌లైన్ పోర్టల్ ద్వారా అనుమతి కోసం నమోదు చేసుకోవాలని అసిస్టెంట్ ఎన్నికల అధికారి శ్రీనివాసరావు తెలిపారు. ఆఫ్ లైన్ ద్వారా 48 గంటల ముందుగా సంతనూతలపాడు నియోజకవర్గ ఎన్నికల అధికారి వద్ద అనుమతి తీసుకోవాలని తెలిపారు. ముందస్తు అనుమతి లేకుండా ఎలాంటి ప్రచారాలు, సభలు నిర్వహించినా ఎన్నికల నిబంధనల మేరకు చర్యలు ఉంటాయని అసిస్టెంట్ ఎన్నికల అధికారి శ్రీనివాసరావు తెలిపారు.

ట్రైనింగ్ సెంటర్ పరిశీలన

మద్దిపాడు: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో పోలింగ్ ఆఫీసర్లకు, అడిషనల్ పోలింగ్ ఆఫీసర్లకు శిక్షణ కార్యక్రమం నిర్వహించడానికి కావాల్సిన వసతులున్న గుండ్లాపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఈఆర్‌ఓ, మండల తహసీల్దార్ అనూరాధ, నోడల్ అధికారి కిరణ్‌కుమార్ శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ పీఓలకు, ఏపీఓలకు శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేయడానికి గుండ్లాపల్లి పాఠశాలను అధికారులు ఎంపిక చేశారని చెప్పారు. సుమారు 500 మందికి శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. శిక్షణ కార్యక్రమం నిర్వహించే తేదీని ఉన్నతాధికారులు తెలియజేస్తారని ఆమె అన్నారు. కార్యక్రమంలో ఆర్‌ఐ అనూష, వీఆర్‌ఓ అంకమ్మ, ఎలక్షన్ సెక్షన్ క్లర్క్ మరియదాసు పాల్గొన్నారు.

43 మంది విద్యార్థులు గైర్హాజరు

తాళ్లూరు (ముండ్లమూరు): మండలంలో శుక్రవారం జరిగిన పదో తరగతి లెక్కలు పరీక్షకు 43 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు ఎంఈఓ సుబ్బయ్య తెలిపారు. మండలంలోని ఆరు పరీక్ష కేంద్రాల్లో 882 మంది విద్యార్థులు పరీక్ష రాయాల్సి ఉండగా 839 మంది విద్యార్థులు హాజరైనట్లు తెలిపారు. పలు పరీక్ష కేంద్రాలను స్క్వాడ్ ఆఫీసర్ వై.వెంకటరావు తనిఖీ చేశారు.

వరిగడ్డి వామి దగ్ధం



గడ్డివామి నుంచి ఎగిసిపడుతున్న మంటలు

కుంకలమర్రు (కారంచేడు): మండలంలోని కుంకలమర్రు గ్రామంలో శుక్రవారం వేకువజామున జరిగిన అగ్ని ప్రమాదంలో సుమారు 10 ఎకరాల వరిగడ్డి వామి దగ్ధమయ్యింది. బాధితుడి వివరాల మేరకు.. గ్రామంలోని కాలువ కట్ట మసీదు సమీపంలో పశువుల కోసం నిల్వ చేసుకున్న వరిగడ్డి వామి అర్ధరాత్రి దాటిన తరువాత మంటలు వ్యాపించాయి. ప్రమాదం ఎలా జరిగిందో తెలియలేదు. స్థానికులు గమనించి మంటలను అదుపు చేసే ప్రయత్నం చేశారు. చీరాల నుంచి వచ్చిన అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలను పూర్తిగా అదుపు చేశారు. గడ్డి విలువ సుమారు రూ.2 లక్షల వరకు ఉంటుందని అంచనా. రెవెన్యూ, సచివాలయ సిబ్బంది వచ్చి సమాచారం సేకరించారు.

లాడ్జి ముందు ఉంచిన బైకు మాయం

మార్టూరు: మార్టూరులోని ఓ లాడ్జి ముందు నిలిపి ఉంచిన ఓ బైకు అదృశ్యమైన విషయమై స్థానిక పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు అయింది. హెడ్ కానిస్టేబుల్ సాయిరాం వివరాల మేరకు.. మార్టూరు కిషోర్ కాలనీకి చెందిన మల్లా వాసు ఈనెల 15వ తేదీ ఉదయం స్థానిక నాగరాజుపల్లి రోడ్డులో గల బీఎస్‌ఆర్ లాడ్జి ముందు తన పల్సర్ బైకును నిలిపి ఉంచి పని మీద వెళ్లాడు. తరువాత వాహనం కోసం వచ్చిన వాసు కొత్త పల్సర్ వాహనం కనిపించలేదు. బైకు గురించి ఎంత వెతికినా ఆచూకీ తెలియకపోవడంతో వాసు శుక్రవారం పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. పల్సర్ బైకును రూ.90 వేలకు కొనుగోలు చేసినట్లు బాధితుడు తెలిపాడు.

ఎన్నికల నిబంధనలు పాటించాలి

- రాజకీయ నాయకులతో తహసీల్దార్ హేమంత్‌కుమార్



అవగాహన కల్పిస్తున్న తహసీల్దార్ హేమంత్‌కుమార్, ఎంపీడీవో ఫణికుమార్‌నాయక్

కొత్తపట్నం: ప్రస్తుత సార్వత్రిక ఎన్నికల్లో ప్రతిఒక్కరూ నియమ నిబంధనలు పాటించాలని తహసీల్దార్ హేమంత్‌కుమార్ సూచించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో శుక్రవారం రాజకీయ పార్టీల నాయకులకు ఎన్నికలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ ఈ నెల 16 నుంచి సార్వత్రిక ఎన్నికల నియమావళి అమల్లోకి వచ్చిందన్నారు. ఎన్నికలు పూర్తయి గెలిచిన అభ్యర్థులను ప్రకటించేంత వరకు నిబంధనలు పాటించాలన్నారు. మండలానికి ఎన్నికల ప్రవర్తనా నియమావళి నోడల్ అధికారిగా ఎంపీడీవో ఫణికుమార్ నాయక్‌ను నియమించడం జరిగిందన్నారు. ఇప్పటికే ఫ్లైయింగ్ స్క్వాడ్, వీడియో వింగ్ టీమ్, వీడియో సర్వైలెన్స్ టీమ్, ఒక చోట చెకింగ్ టీం (ఎస్ఎస్‌టీ)లను కేటాయించడం జరిగిందన్నారు. ప్రతి ఒక్క రాజకీయ నాయకుడు నిబంధనలు పాటించి అధికారులకు సహకరించాలన్నారు. ఓటరు తమ ఓటును నిర్భయంగా వినియోగించుకునే విధంగా మనమంతా సహాయపడాలన్నారు. ఎక్కడా నగదు పంపిణీ చేయకూడదన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో ఫణికుమార్‌నాయక్, ఎస్సై బి.సాంబశివరావు, వైఎస్సార్ సీపీ నాయకులు బంకా శ్రీధర్, గొరవరపు శివాజీ, మరపాల సుధాకర్‌రెడ్డి, టీడీపీ, సీపీఐ, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

ఆయుర్వేదంతో సంపూర్ణ ఆరోగ్యం



వైద్యశాలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి

- ఆప్త ఆయుర్వేద వైద్యశాలను ప్రారంభించిన ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి

ఒంగోలు టౌన్: ఆయుర్వేద వైద్యంతో సంపూర్ణ ఆరోగ్యం సిద్ధిస్తుందని ఒంగోలు ఎమ్మెల్యే, మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి అన్నారు. నగరంలోని కొప్పోలులో నూతనంగా ఏర్పాటు చేసిన ఆప్త ఆయుర్వేద వైద్యశాలను శుక్రవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆయుర్వేద వైద్యం వ్యాధిని పూర్తిగా నిర్మూలిస్తుందని, ఎలాంటి సైడ్ ఎఫెక్టులు ఉండకపోవడం వలన ప్రతిఒక్కరూ ఈ వైద్య చికిత్స చేయించుకోవచ్చని అన్నారు. వేల సంవత్సరాల క్రితమే ప్రపంచానికి ఎంతో అమూల్యమైన వైద్యాన్ని అందించిన ఘనత మన ఆయుర్వేదానికి దక్కుతుందని నగర మేయర్ గంగాడ సుజాత అన్నారు. కరోనా బారిన పడకుండా అనేక మంది ఆయుర్వేద ఔషధాలు ఎక్కువగా వినియోగించారని గుర్తుచేశారు. దీర్ఘకాలిక వ్యాధులను నిర్మూలించే శక్తి ఒక్క ఆయుర్వేదానికి మాత్రమే ఉందన్నారు. ఆస్పత్రి నిర్వాహకులు డాక్టర్ బి.పావని మాట్లాడుతూ తిరుపతిలోని శ్రీ వెంకటేశ్వర ఆయుర్వేద కాలేజీ నుంచి ఎండీ చేసిన తాను.. పంచకర్మలో స్పెషలైజేషన్ చేసినట్లు తెలిపారు. మోకాళ్ల నొప్పులు, నడుము నొప్పికి ఎలాంటి ఆపరేషన్ అవసరం లేకుండా చికిత్స చేయనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు వెన్నపూస శోభారాణి వెంకటరెడ్డి, బెంగళూరు నరసయ్య, మున్సిపల్ కో ఆప్షన్ మెంబర్ ఒర్సు శేషయ్య, వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షుడు కఠారి శంకర్, నాయకులు బైరెడ్డి అరుణ, గంగాడి శ్రీనివాసరావు, హనుమారెడ్డి, భవనం సుబ్బారెడ్డి, సీతారామయ్య, కమ్మ సురేష్, బొమ్మినేని మురళి తదితరులు పాల్గొన్నారు.

ఇఫ్తార్ అల్పాహార విందుకు హాజరైన ఎమ్మెల్యేలు



ఎమ్మెల్యేలు అన్నా రాంబాబు, కేపీ నాగార్జునరెడ్డిని సన్మానిస్తున్న జాకీర్ హుస్సేన్, ముస్లిం పెద్దలు

కంభం: పవిత్ర రంజాన్ మాసాన్ని పురస్కరించుకొని జెడ్పీటీసీ మాజీ సభ్యుడు సయ్యద్ జాకీర్ హుస్సేన్ నివాస గృహంలో ఏర్పాటు చేసిన ఇఫ్తార్ అల్పాహార విందులో గిద్దలూరు, మార్కాపురం ఎమ్మెల్యేలు అన్నా వెంకట రాంబాబు, కేపీ నాగార్జునరెడ్డి, రాష్ట్ర మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ డాక్టర్ షంషేర్ అలీబేగ్‌లు హాజరయ్యారు. పవిత్ర రంజాన్ మాసంలో అందరికీ మంచి జరగాలని వారు ఆకాంక్షించారు. ముస్లింలు పవిత్ర రంజాన్ మాసాన్ని సంతోషంగా గడపాలన్నారు. బీసీ బ్రిలియంట్ కమ్యూనిటీ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు పీఎల్‌పీ యాదవ్, ఏఎంసీ డైరెక్టర్ డాక్టర్ సయ్యద్ మక్బూల్ బాషా, సర్పంచ్‌లు పల్నాటి బోడయ్య, మహబూబ్ పీరా, రసూల్, మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ నెమలిదిన్నె చెన్నారెడ్డి, ఉప సర్పంచ్ సయ్యద్ ఖాసిం, సొసైటీ చైర్మన్ ఫజుల్లా రహమాన్, డిష్ మున్నా, సయ్యద్ సలీం, రఫి, ఆరిఫ్ పాల్గొన్నారు.

పది పరీక్ష కేంద్రాల తనిఖీ

కొమరోలు: మండల కేంద్రం కొమరోలులో 10వ తరగతి పరీక్ష కేంద్రాలను జిల్లా ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులు శుక్రవారం తనిఖీ చేశారు. శుక్రవారం గణితం పరీక్ష నిర్వహించగా మెప్మా పీడీ రవికుమార్, విద్యాశాఖాధికారి శ్రీనివాసరావులు 3 పరీక్ష కేంద్రాలను తనిఖీ చేశారు. అనంతరం స్థానిక ఎస్సై మధుసూదన్‌రావుతో పరీక్ష కేంద్రాల్లో బందోబస్తు, 144 సెక్షన్ అమలు తదితర అంశాలపై చర్చించారు.

క్రికెట్ బెట్టింగులకు పాల్పడితే కఠిన చర్యలు

మార్కాపురం: క్రికెట్ బెట్టింగులకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని పట్టణ ఎస్సై అబ్దుల్ రెహమాన్ హెచ్చరించారు. శుక్రవారం నుంచి ఐపీఎల్ క్రికెట్ మ్యాచ్‌లు ప్రారంభమవుతున్న నేపథ్యంలో ఆయన మాట్లాడుతూ గతంలో బెట్టింగులు నిర్వహిస్తూ పట్టుబడిన వారిపై ప్రత్యేక నిఘా పెట్టామని తెలిపారు. లాడ్జీలు, అనుమానిత ప్రదేశాలపై కూడా ప్రత్యేక దృష్టి సారించామన్నారు.

తర్లుపాడులో..

తర్లుపాడు: ఐపీఎల్ క్రికెట్ ప్రారంభమవుతున్న సందర్భంగా బెట్టింగులకు, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తప్పవని ఎస్సై వేముల సుధాకర్ హెచ్చరించారు. బెట్టింగు నిర్వాహకులపై ప్రత్యేక దృష్టిసారించినట్లు ఆయన తెలిపారు. ఎవరైనా బెట్టింగులకు పాల్పడితే తమకు సమాచారమివ్వాలని కోరారు.

మద్యం అక్రమంగా ఉన్న వ్యక్తి అరెస్టు

అర్ధవీడు (కంభం): మద్యం అక్రమంగా కలిగి ఉన్నా, విక్రయించినా కఠిన చర్యలు తప్పని ఎస్సై టి.పావని హెచ్చరించారు. మండలంలోని పాపినేనిపల్లిలో ఓ దుకాణంలో తనిఖీలు నిర్వహించగా అక్రమంగా నిల్వ ఉంచిన పది మద్యం సీసాలు గుర్తించి సదరు వ్యక్తిని అదుపులోకి తీసుకున్నట్లు ఆమె పేర్కొన్నారు. ఎన్నికల కోడ్ అమల్లో ఉన్న నేపథ్యంలో నిత్యం పోలీసులు తనిఖీలు నిర్వహిస్తుంటారని తెలిపారు.

20 మద్యం బాటిళ్ల స్వాధీనం

మార్కాపురం టౌన్: మార్కాపురం పట్టణ శివార్లలో ఎస్‌వీకేపీ కళాశాల రోడ్డులో 20 మద్యం బాటిళ్లను అక్రమంగా తరలిస్తున్న వ్యక్తిని శుక్రవారం అరెస్టు చేసినట్లు పట్టణ ఎస్సై అబ్దుల్ రెహమాన్ తెలిపారు. సుంకేశుల గ్రామానికి చెందిన వ్యక్తిని అరెస్టు చేసినట్లు చెప్పారు.

అక్రమ మద్యం పట్టివేత

కొనకనమిట్ల: మండలంలోని వద్దిమడుగు గ్రామంలో అక్రమంగా మద్యం ఉండటాన్ని గుర్తించిన పోలీసులు పట్టుకున్నారు. ఎస్ఐ మాధవరావు తన సిబ్బందితో వద్దిమడుగు వెళ్లి ఓ వ్యక్తి వద్ద ఉన్న 16 క్వార్టర్ బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. అతనిపై కేసు నమోదు చేస్తున్నట్లు ఎస్ఐ మాధవరావు అన్నారు.

ఎన్నికల నియమాలు పాటించాలి

కొనకనమిట్ల: త్వరలో అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికలు జరుగుతున్న నేపథ్యంలో ప్రజలు ఎన్నికల నియమాలను పాటించి ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేలా చూడాలని ఎస్ఐ మాధవరావు అన్నారు. శుక్రవారం రాత్రి మండలంలోని గొట్లగట్టు, చినమనగుండం గ్రామంలో ప్రజలతో సమావేశం నిర్వహించి ఎన్నికల నియమాలను తెలియజేశారు. గ్రామాల్లో ఎలాంటి గొడవలు లేకుండా, క్షణికావేశాలకు పోకుండా ఉండి ప్రశాంతంగా ఎన్నికలు నిర్వహించుకోవాలన్నారు. గ్రామాల్లో ఏమైనా ఇబ్బందులు ఉంటే పోలీసువారికి తెలియజేయాలని ఎస్ఐ మాధవరావు ప్రజలను కోరారు.

కార్మిక వ్యతిరేక ఎన్డీఏ కూటమిని ఓడించండి

- ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు రావులపల్లి పిలుపు



మాట్లాడుతున్న రవీంద్రనాథ్

మార్కాపురం: కార్మిక, కర్షక, ప్రజా వ్యతిరేక విధానాలే లక్ష్యంగా ముందుకెళ్తున్న ఎన్డీఏ కూటమిని వచ్చే అసెంబ్లీ, పార్లమెంటు ఎన్నికల్లో ఘోరంగా ఓడించాలని ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు రావులపల్లి రవీంద్రనాథ్ కార్మికులకు పిలుపునిచ్చారు. స్థానిక ఏఐటీయూసీ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన కార్యకర్తల ముఖ్యసమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. దేశ ప్రజలకు విశిష్ట సేవలందిస్తున్న ఎల్ఐసీ, పోస్టల్, బీఎస్ఎన్ఎల్, రైల్వేలు, విమానయాన, నౌకాశ్రయాలు తదితర లక్షల కోట్ల రూపాయలు విలువచేసే జాతి సంపదను కేంద్రంలోని ఎన్డీఏ ప్రభుత్వం నష్టాలబాట చూపుతూ చవకగా అంబానీ, అదానీ తదితర పారిశ్రామిక దిగ్గజాలకు దోచిపెడుతోందని విమర్శించారు. విశాఖ స్టీలు ప్లాంటును కేంద్ర ప్రభుత్వం నిర్వీర్యం చేసే కుట్ర జరుగుతోందన్నారు. ఏడు దశాబ్దాల కాలంలో ఎన్నడూలేని విధంగా ఎన్డీఏ ప్రభుత్వం కార్మిక చట్టాలలో భారీ మార్పులు తీసుకొచ్చి కార్మికులకు ఉద్యోగ భద్రత లేకుండా చేసిందన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ కార్యదర్శి అందె నాసరయ్య, ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి కే వెంకటేశ్వర్లు, ఏలూరి వెంకటరెడ్డి, చిత్తారి పెద్దన్న, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సత్యన్నారాయణస్వామి వ్రతాలు



వ్రతాలలో పాల్గొన్న దంపతులు

స్వర్ణ (కారంచేడు): మండలంలోని స్వర్ణ గ్రామంలో కొలువైన వెంకటేశ్వరస్వామి వారి ఆలయంలో శుక్రవారం సత్యన్నారాయణ స్వామి వ్రతాలను కన్నుల పండువగా నిర్వహించారు. గత మూడు రోజుల నుంచి ఆలయ 48వ వార్షికోత్సవం అత్యంత వైభవంగా భక్తిశ్రద్ధలతో జరుపుతున్నారు. ఆలయ ప్రధాన అర్చకులు ఏవీఎస్ బ్రదర్స్ సహకారంతో ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు ప్రత్యేక ఏర్పాట్లు, అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. శుక్రవారం ప్రత్యేక పూజలు, అభిషేకాలు, వ్రతాల అనంతరం సుమారు 1500 మంది భక్తులకు అన్నదాన సంతర్పణ నిర్వహించారు.

వృద్ధుడిపై దాడి కేసు విచారణ

బల్లికురవ: పోలీసులు అక్రమ కేసు బనాయించి వృద్ధుడనే కనికరం కూడా లేకుండా దాడిచేశారని బల్లికురవ గ్రామానికి చెందిన పావులూరి దుర్గా భవాని ఫిర్యాదు చేసింది. ఈఫిర్యాదు మేరకు శుక్రవారం సాయంత్రం విజయవాడకు చెందిన స్వేచ్ఛ స్వచ్ఛంద సంస్థ నిజనిర్ధారణ కమిటీ సభ్యులు శ్రీనివాసరావు, కిషోర్, హరీష్, నాగేంద్ర, ఐశ్వర్య, దుర్గా భవాని చెన్నుపల్లి వెళ్లే రోడ్డులో నిర్వహిస్తున్న షాపు, ఇంటి వద్ద, స్థానిక పోలీస్‌స్టేషన్‌లో వేర్వేరుగా విచారణ చేపట్టారు. అధికారులు తొందరపాటు చర్యలు తీసుకోవద్దని కమిటీ కోరారు.

విద్యార్థుల్లో ఆవిష్కరణ స్ఫూర్తి వెలికితీయడమే ధ్యేయం



సర్టిఫికెట్లు అందుకుంటున్న విద్యార్థులు

ఒంగోలు సెంట్రల్: విద్యార్థుల్లో ఆవిష్కరణ స్ఫూర్తిని వెలికితీయడమే లక్ష్యంగా ప్రత్యేక శిక్షణ ఇస్తున్నట్లు రైజ్ కృష్ణసాయి గాంధీ గ్రూప్ ఆఫ్ ఇన్‌స్టిట్యూషన్ కరస్పాండెంట్ శిద్దా హనుమంతరావు, చైర్మన్ ఇస్కాల చినరంగమన్నార్ అన్నారు. కళాశాలలో ఈసీఈ విభాగానికి చెందిన విద్యార్థులకు ఆర్డినో అండ్ ఇట్స్ అప్లికేషన్స్‌పై శుక్రవారం వర్క్‌షాప్ నిర్వహించారు. నరేష్ టెక్నాలజీ అండ్ సర్వీస్ డైరెక్టర్ డాక్టర్ ఎస్‌వీ నరేష్ విద్యార్థులకు టెక్నాలజీపై శిక్షణ ఇచ్చారు. ఈసీఈ విభాగపు అధిపతి ఎస్‌వీ రవికుమార్, ప్రిన్సిపాల్ డాక్టర్ కేవీ సుబ్రహ్మణ్యం విద్యార్థులు సాంకేతికంగా నైపుణ్యం సాధిస్తే భవిష్యత్తులో ఉద్యోగాలు పొందడం సులభతరం అవుతుందని అన్నారు. సాంకేతికత పెంచుకోవడం, పట్టు సాధించడంపై శ్రద్ధ చూపాలని కోరారు. నైపుణ్యం పొందిన విద్యార్థులకు సర్టిఫికెట్లు అందించారు.

చెక్‌పోస్టుల వద్ద సిబ్బంది అప్రమత్తంగా ఉండాలి



చెక్‌పోస్టు వద్ద భద్రతను పరిశీలిస్తున్న తహసీల్దార్, ఎంపీడీవో

నాగులుప్పలపాడు: ఎన్నికల నియమావళిని అనుసరించి మండలంలో ఏర్పాటు చేసిన చెక్‌పోస్టుల వద్ద సిబ్బంది అప్రమత్తంగా పనిచేయడంతో పాటు నిరంతరం నిఘా ఉంచాలని తహసీల్దార్ శ్రీనివాసరావు, ఎంపీడీవో మహాలక్ష్మి సూచించారు. 216 జాతీయ రహదారిపై నాగులుప్పలపాడు వద్ద ఏర్పాటు చేసిన చెక్‌పోస్టును ఎస్సై బ్రహ్మనాయుడుతో కలిసి శుక్రవారం పరిశీలించారు. అక్కడి సిబ్బందికి పలు సలహాలు, సూచనలు చేశారు.

పేదలకు సాయం చేయడం మన బాధ్యత



వృద్ధాశ్రమంలో దుస్తులు పంపిణీ చేస్తున్న షేక్ మహబూబ్

ఒంగోలు టౌన్: సమాజంలో ఆదరణకు నోచుకోని అనాథలు, అభాగ్యులు, నిరుపేదలకు ప్రతిఒక్కరూ సాయం చేయాలని దోస్తీ ఫౌండేషన్ చైర్మన్ షేక్ మహబూబ్ కోరారు. నగరంలోని బలరాం కాలనీలో డీపీ వృద్ధుల ఆశ్రమంలో శుక్రవారం దోస్తీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో దుస్తులు, పండ్లు పంపిణీ చేశారు. ఎంతో పవిత్రమైన రంజాన్ మాసంలో అందరూ శక్తి మేరకు దానధర్మాలు చేయాలని ఆయన పిలుపునిచ్చారు. రంజాన్ మాసంలో చేసే పుణ్యకార్యాలకు 70 రెట్లు అధికంగా ఫలితం దక్కుతుందని చెప్పారు. వృద్ధాప్యంలో ఉన్న తలిదండ్రులను ప్రేమగా ఆదరించాలని, కన్న బిడ్డల కోసం తమ జీవితాలను త్యాగం చేసిన వారిని గౌరవించాలని కోరారు. కార్యక్రమంలో సూర్యశ్రీ దివ్యాంగుల ట్రస్ట్ కార్యదర్శి షేక్ సర్దార్, నత్తల శ్రీనివాసరావు, జబీనా తదితరులు పాల్గొన్నారు.

గొర్రెపాడులో ప్రతిష్ట మహోత్సవాలు



ప్రతిష్ఠకు ఏర్పాటు చేసిన మండపం

బల్లికురవ: మండలంలోని గొర్రెపాడు గ్రామంలో అభయాంజనేయస్వామి, బాలాంజనేయస్వామి, గణపతి విగ్రహాల వాయుప్రతిష్ఠను బుధవారం ఉదయం 8.14 గంటలకు నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు శుక్రవారం తెలిపారు. గ్రామస్తుల సమష్టి కృషి సుమారు రూ.30 లక్షలతో కొండకు ఉత్తర భాగంగాలో ఒకే మండపంపై మూడు విగ్రహాలను ఏర్పాటు చేయనున్నారు. ప్రతిష్ఠాచార్యులు ఓరుగంటి సీతారామశాస్త్రి, జే శ్రీనివాసమూర్తి, బృందంచే సోమవారం గణపతి పూజ, పుణ్యాహవచనం, అంకురార్పణ, యాగశాల ప్రవేశం రక్షాబంధనం, మృత్యుంజయ గ్రహణం సాయంకాలం విగ్రహాలను గ్రామోత్సం చేపట్టనున్నారు. మంగళవారం విగ్రహాలకు జలాధి, ధాన్యాధివాసాలు, బుధవారం ఉదయం 8.14 గంటలకు మంత్రాలతో ప్రాణ ప్రతిష్ఠ, అనంతరం అన్న సంతర్పణ చేపట్టనున్నట్లు చెప్పారు. మూడు రోజులపాటు జరిగే ఈ వేడుకల్లో గ్రామస్తులు, భక్తులు పాల్గొని పరిసర గ్రామస్తులు పాల్గొని స్వామి అమ్మవార్లను దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించాలని ఆలయ కమిటీ సభ్యులు కోరారు.

ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలి



కంభం: ఓటు హక్కుపై అవగాహన కల్పిస్తున్న అధికారులు



పెద్దారవీడులో ఓటు హక్కుపై ర్యాలీ

కంభం: ప్రతి ఒక్కరూ ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ సయ్యద్ మస్తాన్ వలి అన్నారు. శుక్రవారం యువ ఓటర్లకు అవగాహన సదస్సు నిర్వహించారు. రాబోయే ఎన్నికల్లో వంద శాతం ఓటింగ్ జరిగేలా చూడాలన్నారు. తొలిసారి ఓటు వేయబోతున్న యువ ఓటర్లు తమ ఓటు హక్కును తప్పని సరిగా వినియోగించుకోవాలని కోరారు. డిప్యూటీ తహసీల్దార్ శ్రీను, ఏపీఓ ఏడుకొండలు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

గిద్దలూరు రూరల్: కొత్తగా ఓటు హక్కు వచ్చిన యువ ఓటర్లు ఓటు వేయడంపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి నాగజ్యోతి అన్నారు. పట్టణంలోని అటవీ శాఖ కార్యాలయం పోలింగ్ కేంద్రంలో ఆమె శుక్రవారం యువ ఓటర్లకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పోలింగ్ కేంద్రంలో ఓటువేసే యంత్రం వద్దకు ఎలా వెళ్లాలి? ఓటు ఏ విధంగా వేయాలి? ఆ తర్వాత ఎలా బయటకు రావాలి వంటి అంశాలపై అవగాహన కల్పించారు. తహసీల్దార్ సిద్దార్థ్, ఎలక్షన్ డీటీ భారతీబాయ్, వీఆర్‌ఓలు వైపీ రంగయ్య, నాగేంద్ర పాల్గొన్నారు.

పెద్దారవీడు: వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ తమ ఓటును ప్రశాంత వాతవరణంలో నిర్భయంగా వినియోగించుకోవాలని డ్వామా ఏపీడీ నిర్మలాదేవి అన్నారు. మండల కేంద్రం పెద్దారవీడులో ఓటర్లకు ఓటు హక్కు వినియోగంపై అంగాహన ర్యాలీ శుక్రవారం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు వజ్రాయుధమని, 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరికీ రాజ్యాంగం ఓటు హక్కు కల్పించిందని చెప్పారు. అర్హులు తమ ఓటును నమోదు చేయించుకొని వినియోగించుకోవాలన్నారు. ప్రతి ఒక్కరూ స్వేచ్ఛగా ఓటు వేసేందుకు ఎన్నికల కమిషన్ అనేక చర్యలు తీసుకుంటోందని, ఎలాంటి ప్రలోభాలకు గురవకుండా మంచి నాయకత్వాన్ని ఎన్నుకునేందుకు ఓటు వేయడం అందరి బాధ్యతన్నారు. ఎంపీడీఓ రాజ్‌కుమార్, ఏపీఓ మంత్రు నాయక్, టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు, సిబ్బంది పాల్గొన్నారు.